క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి హనుమంతసేవ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు సోమవారం రాత్రి హనుమంతసేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్య పూర్ణాహుతి, మంగళశాసనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై కొలువైన స్వామివారిని గ్రామోత్సవానికి తరలించారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా సత్యవోలు బుజ్జమ్మ కుటుంబసభ్యులు వ్యవహరించగా, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



ఇందుకూరుపేట : మండలంలోని ఆదెమ్మసత్రం గిరిజన కాలనీకి చెందిన గిరిజన మహిళలకు సోమవారం చీరలను పంపిణీ చేశారు. జగదేవిపేట గ్రామానికి చెందిన మన్నెంగి కృష్ణారెడ్డి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు వరప్రసాద్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కుమార్‌రెడ్డి గిరిజన మహిళలకు చీరలను అందించారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందించే డ్రిప్ పరికరాలను మండలంలోని ఊటుకూరు, వరిణి గ్రామాల్లోని వేరుశనగ రైతులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ బిందు సేద్యం ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నట్లు వివరించారు. ఈ పరికరాలను ఫినోలెక్స్ ప్లాసన్ కంపెనీ వారు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీర్ బాలాజీరెడ్డి, డీసీటీసీహెచ్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ హరి పాల్గొన్నారు.

వైభవంగా అన్నాభిషేకం

ముత్తుకూరు : కృష్ణపట్నం గ్రామంలోని కామాక్షి సమేత సిద్ధేశ్వరాలయంలో మూడు రోజుల పాటు తలపెట్టిన మహాశివరాత్రి వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా శతరుద్రీయ అభిషేకం, 27 రకాల విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం అన్నాభిషేకం, అన్నలింగ ప్రతిష్ట నిర్వహించారు. శాంతి హోమం, వాస్తు హోమం, పూర్ణాహుతి తర్వాత ఆలయం వద్ద ఉన్న దొరువులో అన్నలింగ నిమజ్జనం చేశారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

బుచ్చిరెడ్డిపాళెం : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేదలకు న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసుల నాయక్ అన్నారు. మండలంలోని జొన్నవాడ అరుంధతీయవాడలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వారు కూడా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వెంకటాచలం: మండలంలోని కసుపూరులో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను డ్వామా పీడీ వెంకట్రావు సోమవారం పరిశీలించారు. పంట కాలువలో పూడికతీత పనులను పీడీ పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. చేస్తున్న పనికి కూలీ గిట్టుబాటు లభిస్తుందా? ప్రతి రోజూ పని కల్పిస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీఓ సురేంద్రబాబు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని చౌకచెర్ల, పార్లపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కావలి ఏపీడీ మృదుల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కొన్ని గ్రామాల్లో జాబ్‌కార్డులు ఉన్నవారి స్థానంలో మరొకరు వచ్చి పనులు చేసినట్లు ఆరోపణలు రావడంతో పరిశీలించామన్నారు. ఎలాంటి అవకతవకలు జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రాలు

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ సోమవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. భూవివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, దారి వివాదాలు తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. వీఆర్వోలు, సర్వేయర్ల ద్వారా విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెల్లడించారు.

మేజర్ డ్రెయిన్‌కు కష్టకాలం

- పూడిపోయిన నక్కలకాలువ డ్రెయిన్
- ఆక్రమణలు, ముళ్ల చెట్లు తొలగిస్తే రైతులకు మేలు

డ్రెయిన్ పొడవు	డ్రెయిన్ వెడల్పు
19 కిలోమీటర్లు	70 మీటర్లు

కాలువ తీరంలోని గ్రామాలు..
పాట్టింపాడు, పోలంరాజుగుంట, పంటపాళెం, నిడిగుంటపాళెం, అట్రంవారికండ్రిగ, ఉలసవాగు, దర్బలమిట్ట, తిరుమలమ్మపాళెం



పంటపాళెం వద్ద నక్కలకాలువ డ్రెయిన్ దుస్థితి

ముత్తుకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు, వెంకటాచలం మండలాల్లో వేలాది ఎకరాల పంటపొలాలను ముంపు నుంచి కాపాడే నక్కలకాలువ మేజర్ డ్రెయిన్ క్రమంగా పూడిపోయింది. ముత్తుకూరు మండలంలోని పాట్టింపాడు వద్ద మొదలై వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెం వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. సర్వేపల్లి రిజర్వాయర్ నీటి మట్టం ప్రమాద స్థితికి చేరినప్పుడు పాట్టింపాడు వద్ద ఉన్న 15 తూముల ద్వారా వరద నీటిని నక్కలకాలువలోకి విడుదల చేస్తారు. సుమారు 30 ఏళ్ల క్రితం ప్రపంచ బ్యాంక్ నిధులతో ఈ మేజర్ డ్రెయిన్ పూడికతీసి, పటిష్టం చేశారు. తర్వాత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. 2015 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను, మునిగిపోయిన నక్కలకాలువను, మునిగిపోయిన పొలాలను, కట్టలు తెగిన రొయ్యల చెరువులను అప్పటి సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయారు.

వరి, వెనామీ రొయ్యలు ప్రధాన సాగు

నక్కలకాలువ కింద ప్రధానంగా వరి సాగు, వెనామీ రొయ్యల సాగు జరుగుతోంది. అయితే, ఆక్రమణల వల్ల, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోవడం, లోతు–వెడల్పు తగ్గిపోవడం వల్ల కాలువ రూపురేఖలు మారిపోయాయి. తరచూ కురిసే భారీ వర్షాలకు పొలాలు, రొయ్యల చెరువులను ముంచెత్తే వరద నీటిని సంగ్రహించే స్థితి కోల్పోయింది. దీని వల్ల రైతులు వరి నార్లు, విత్తనాలు నష్టపోతున్నారు. సకాలంలో వరిసాగు చేయలేకపోతున్నారు. గత నవంబర్, డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కాలువ ఒడ్డున ఉన్న గ్రామాల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. రైతులకు నష్టాలు మిగిల్చాయి.



సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద నక్కలకాలువ తూములు

అప్పటి నుంచి కాలువ పూడిక తీయాలన్న డిమాండ్ రైతుల్లో మొదలైంది. పూడిక తీసే పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, ఆక్రమణలు తొలగిస్తే చాలునని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతులు నష్టపోతున్నారు



మేజర్ డ్రెయిన్ నక్కలకాలువ ఆక్రమణల పాలైంది. విపరీతంగా ముళ్లచెట్లు పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడింది. భారీ వర్షాలకు మునిగిపోయే పొలాల నుంచి వరద నీటిని తరలించే సామర్థ్యం కొరవడింది. దీంతో భారీ వర్షాలు కురిస్తే పైర్లు, నార్లు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.
– పోచారెడ్డి చెంగారెడ్డి, మండల ఏపీబీ సభ్యుడు, రామాపురం.

మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లాం



పూడిపోయిన నక్కలకాలువ డ్రెయిన్ వల్ల సుమారు పది గ్రామాల రైతులు తరచూ నష్టపోతున్నారు. ఆక్రమణలు, ముళ్ల చెట్లు తొలగిస్తే రైతులకు కొంత మేలు జరుగుతుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఈ కాలువ దుస్థితి, మునిగిపోయే పొలాల పరిస్థితి వివరించాం. పూడిక తీయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.
– పల్లంరెడ్డి జనార్ధనరెడ్డి, మాజీ సర్పంచ్, పాట్టింపాడు.

గృహసారథుల పాత్ర ఎంతో కీలకం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించేందుకు గృహసారథుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న స్రిడ్స్ కల్యాణ మండపంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా గృహసారథులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు వెల్లడించారు.

తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలి

చంద్రబాబు, పచ్చపత్రికల విష ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందని మంత్రి కాకాణి అన్నారు. గ్రామంలో ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు చొప్పున నియమితులైన గృహసారథులు మార్చి 20 నుంచి ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. గత చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన మోసాలు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేస్తున్న అభివృద్ధిపై ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల వరకు ప్రచారం కొనసాగించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయనే విషయాన్ని వివరించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కసుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఆలకించి, పరిష్కరించి

- సచివాలయ నిధులతో సిమెంటురోడ్డు నిర్మాణం



నేదురుమల్లి గ్రామంలో నిర్మించిన సిమెంటురోడ్డు

పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో చక్కటి సిమెంటురోడ్ల నిర్మాణం జరిగింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇటీవల నేదురుమల్లి సచివాలయ పరిధిలో నేదురుమల్లి, యర్రబల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమకు సిమెంటురోడ్లు కావాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మంత్రి సంబంధిత పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో మాట్లాడి సచివాలయానికి రూ.20 లక్షల వంతున మంజూరు చేసే నిధులను కేటాయించారు. దీంతో వెంటనే గ్రామ సర్పంచ్ ఉడతా రమేష్ ఎస్సీ కాలనీ, బావికాడవీధి, యాదవవీధి తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లను నిర్మించారు. యర్రబల్లిలో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే వరిసాగు చేస్తున్నందున డ్రెయిన్ల గుండా సాగునీటి సరఫరా జరుగుతున్న నేపథ్యంలో నీటి విడుదల నిలిచిన తర్వాత డ్రెయిన్లను పూర్తి చేస్తామని సర్పంచ్ వెల్లడించారు. గ్రామస్తులు మంత్రి కాకాణికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రపర్వం శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పొదలకూరు : స్థానిక కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. ఆర్యవైశ్య సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. వందలాది మంది భక్తులు శివపార్వతుల కల్యాణాన్ని వీక్షించారు. తన్నీరు వెంకటచలపతి–సునీత లక్ష్మి అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. పాలకమండలి చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం, సభ్యులు విజయభాస్కర్‌రెడ్డి, భారతి, హైమావతి, కుమారి, ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

లోకేశ్ యువగళం మూగబోయింది

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎస్సీకాలనీలో మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : లోకేశ్ యువగళం మూగబోయిందని, 4 వేల కి.మీ పాదయాత్ర చేస్తానని చెప్పి చచ్చుపడిపోయాడని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్‌వైపాళెం సచివాలయంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.80 లక్షలతో సిమెంటురోడ్లు, రూ.40 లక్షలతో సైడ్‌డ్రెయిన్లు, రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ ఎక్కడ పాదం మోపినా అరిష్టం దాపురిస్తున్నట్లు ధ్వజమెత్తారు. వారు ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా అశుభాలే జరుగుతున్నాయని, దేవుడు కూడా వారికి సహకరించడం లేదన్నారు. ఇరుకు రహదారుల్లో చంద్రబాబు మీటింగులు పెట్టి 11 మందిని చంపితే, లోకేశ్ పాదయాత్ర ప్రారంభం రోజునే ఎన్టీఆర్ వారసుడు తారకరత్న గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ముఖ్యం

తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమని మంత్రి కాకాణి చెప్పారు. గత టీడీపీ హయాంలో గ్రామాల్లో శిలాఫలకాలు వేసి వెళితే ఆ పనులను తాము పూర్తి చేసినట్లు తెలిపారు. అంకుపల్లి, ఆర్‌వైపాళెం గ్రామాల్లో రెండు రోజుల 'గడగ పడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రూ.3 కోట్ల మేర అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. గ్రామాలకు దారులు తెలియని వారి విమర్శలను పట్టించుకునేది లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ దేవరపాటి పెంచలమ్మ, నాయకులు బూసుపల్లి చిన్నపరెడ్డి, గజ్జెల సంజీవరెడ్డి, గజ్జెల వేణుగోపాల్‌రెడ్డి, బీపీ నారాయణరెడ్డి, గోపిదేసి రాఘయ్య, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'మా నమ్మకం నువ్వే జగన్' సదస్సు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి వృద్ధాశ్రమ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటలకు 'మా నమ్మకం నువ్వే జగన్' సదస్సును నిర్వహిస్తామని మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి సోమ వారం తెలిపారు. ఈ సదస్సుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

పిడూరుపాళెంలో 'గడప గడపకు..'

మనుబోలు : మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నేత ఏడెం మల్లికార్జునరెడ్డి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తోటపల్లిగూడూరు : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. 'మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్' అనే అంశాలపై సోమవారం చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల, కోడూరు గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

భక్తులకు అన్నదానం

కొడవలూరు : గండవరంలోని ఉదయకళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఆలయం సమీపంలో కల్పవృక్ష సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివార్ల రథోత్సవం కావడంతో భక్తుల తాకిడి దృష్ట్యా కార్యక్రమం ఏర్పాటు చేశామని ట్రస్టీ నెల్లూరు సునీతారెడ్డి తెలిపారు.

శివాలయం అభివృద్ధికి కృషి



స్వామి అమ్మవార్లకు పూజలు చేస్తున్న మంత్రి

పొదలకూరు : పట్టణంలోని చరిత్రక శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయంలో ధర్మకర్తల మండలి విజయవంతంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్వామి అమ్మవార్ల కల్యాణం సందర్భంగా సోమవారం మంత్రి దేవస్థానానికి విచ్చేసి పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ తన్నీరు సుబ్రమణ్యం, సభ్యులు మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాలయం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాల్సిందిగా మంత్రికి వినతిపత్రం సమర్పించారు. వెంటనే ఈఓ పెంచలవరప్రసాద్‌ను అంచనాలు తయారు చేయించాల్సిందిగా మంత్రి ఆదేశించారు. ఆయన వెంట ధర్మకర్తల మండలి సభ్యులు దాదిబత్తిన విజయభాస్కర్‌రెడ్డి, వూకోటి లక్ష్మీనారాయణ, కొంగి లక్ష్మయ్య, ప్రసాద్‌స్వామి, పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ మొలబంటి శేఖర్‌బాబు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, ఆదూరు వెంకటసుబ్బయ్య ఉన్నారు.

సేవాభావం పర్వతరెడ్డి సొంతం



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సేవాభావం కలిగిన నాయకుడని, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా దేశంలోనే గుర్తింపు పొందినట్లు అపస్మా రాష్ట్ర నాయకుడు నేతాజీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కేసీఆర్‌ఎస్ ఫంక్షన్‌హాలులో చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సదస్సు జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి సారిగా ప్రైవేటు ఉపాధ్యాయులకు ఓటుహక్కు దక్కిందని, మొదటి ప్రాధాన్యత ఓటును చంద్రశేఖర్‌రెడ్డికి వేసి గెలిపించాల్సిందిగా సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు రాణప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ప్రైవేట్ ఉపాధ్యాయులకు అండగా నిలబడతారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపస్మా జిల్లా, నియోజకవర్గ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఉదయకళేశ్వరుని రథోత్సవం



గండవరం వీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తజనం



ఆలయ ప్రాంగణంలోని కోనేరులో తెప్పోత్సవం

కొడవలూరు : గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన స్వామి అమ్మవార్లు రథంపై కొలువు దీరగా తహసీల్దార్ రమాదేవి రథాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు శంభో శంకర హర.. హర.. మహాదేవ అంటూ రథాన్ని లాగారు. రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, బుచ్చి సీఐ రామారావు, ఎస్సై సుబ్బారావు, వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.వెంకయ్యనాయుడు, ఈఓ శాంతయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు ఆర్.రాజేష్‌రెడ్డి, వెంకట నగేష్‌నాయుడు, పి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి తెప్పోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా సాగింది. పూలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై స్వామి అమ్మవార్లు కొలువుదీరారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా మ్యూజికల్ నైట్ అలరించింది. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు స్వామివార్లను దర్శించుకున్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

- ఓవరాల్ చాంపియన్ గంగపట్నం

ఇందుకూరుపేట : నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సాయంతో 98వ గ్రిగ్ క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, ఓవరాల్ చాంపియన్‌గా గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాల నిలిచింది. వ్యాపారవేత్త దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, డీఏపీబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, నిర్వాహక కమిటీ ఉపాధ్యక్షులు ఝాన్సీలత, కార్యదర్శి ఎం.పల్లవి, హెచ్‌ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గంగపట్నం విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

డిగ్రీ పరీక్షల్లో 10 మంది డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 10 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10,535 మంది విద్యార్థులకు 9,310 మంది హాజరు కాగా, 1,225 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. విడవలూరులోని పీవీఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఐదుగురు నాయుడుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయ్యారని తెలిపారు.

నేడు మాతృభాషా దినోత్సవం

వెంకటాచలం: మండలంలోని సరస్వతినగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పెట్రోల్ బంక్‌ల తనిఖీ

పొదలకూరు : జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పెట్రోలు బంక్‌ను తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దామోదర్ బంక్, గేటుసెంటర్‌లోని శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్, మర్రిపల్లికి సమీపంలో ఉన్న నాయారా తాజ్ బంక్‌లను పరిశీలించారు. పెట్రోలు, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారుల కోసం తాగునీరు, ఫ్రీఎయిర్ అంశాలపై విచారించారు. సీఎస్ డీటీ ఐ.రవి ఉన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

ఇందుకూరుపేట : మండలంలో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఈ–పంటలో నమోదు చేసుకోవాలని డీఏఓ సుధాకర్‌రాజు కోరారు. మండలంలోని కోరుటూరు గ్రామంలో ఈ–పంట నమోదుపై రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–పంటలో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలతో పాటు పంట రుణాలు మంజూరవుతాయన్నారు. అలాగే ధాన్యం కొనుగోలుకు కూడా ఈ–పంట నమోదు తప్పనిసరి అని తెలిపారు. ఈయన వెంట ఏఓ రఘునాథ్‌రెడ్డి, విస్తరణ అధికారులు పెంచలయ్య, నవీన్ పాల్గొన్నారు.